ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.11, నల్ల వంకాయ 23, పొడుగు వంకాయ 18, బెండకాయ 55, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 23, క్యాప్సికమ్ 50, పచ్చకాకర 35, పందిరి బీర 38, క్యాబేజీ 15, క్యారెట్ 37, దొండ 35, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 45, గోకరకాయ 35, కీర 13, దోసకాయ 21, బీట్‌రూట్ 37, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 26, చామగడ్డ 35, మొరంగడ్డ 28, కందగడ్డ 45, సొరకాయ 11, పొట్లకాయ 15, అరటికాయ 8, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: ప్రకాష్‌నగర్, సంజీవయ్యపార్కు, ఎయిర్‌పోర్ట్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్ ఏరియా, ఆర్మా మసీదు, రిజిస్ట్రేషన్ ఆఫీసు లేన్, ఎస్‌బీటీనగర్, వికార్‌నగర్, ప్రకాష్‌నగర్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కామత్‌లింగాపూర్, ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్, ప్రకాష్‌నగర్ వాటర్‌ట్యాంక్, ఇండియన్ ఎయిన్‌లైన్స్ కాలనీ, ప్రకాష్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

కార్యవర్గం



అధ్యక్ష, కార్యదర్శులతో కమిటీ సభ్యులు

అమీర్‌పేట: బల్కంపేట ఎస్‌వీఎస్ మానిక్ ఆర్కేడ్ రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆకుల రాంచందర్, ఉపాధ్యక్షుడు రంగనాథ్, ప్రధానకార్యదర్శి విజయ్ కుమార్, కోశాధికారి వెంకటేశ్వర్‌రావు, కార్యవర్గ సభ్యులుగా లక్ష్మి, రజనీలు ఎన్నికయ్యారు. సభ్యులందరి సహకారంతో సమస్యలను పరిష్కరిస్తామని వారు తెలిపారు.

డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న దృశ్యం

అడ్డగుట్ట: సౌత్ సెంట్రల్ రైల్వే ఇంజినీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం డైరీ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం లాలాగూడలోని ఎలక్ట్రికల్స్ సిస్టమ్ ట్రైనింగ్ సెంటర్ ఆడిటోరియంలో జరిగింది. ఈ కార్యక్రమంలో రైల్వే కన్‌స్ట్రక్షన్ సిఈఈ సీహెచ్ఎస్ రెడ్డి, ట్రాక్ సీఈ కృష్ణారెడ్డి, ఆర్‌వీఎన్‌ఎల్ జీఎం ఆనంద చెక్కిల్ల తదితరులు పాల్గొని డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పక్షవాతంతో బాధపడుతున్న వృద్ధుడి అదృశ్యం



గుంటి మల్లేశం (70)

బౌద్ధనగర్: పక్షవాతంతో బాధపడుతున్న ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన వారాసీగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం... ముషీరాబాద్ బాపూజీనగర్‌కు చెందిన గుంటి మల్లేశం(70) కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఈ నెల రెండో తేదీన ఉదయం ఎనిమిది గంటల ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతని కోసం పలు చోట్ల గాలించగా ఫలితం లేకపోవడంతో గురువారం రాత్రి ఆయన కోడలు వారాసీగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన పదేళ్లుగా పక్షవాతంతో బాధపడుతన్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

6న బీజేపీ రాష్ట్ర కార్యాలయం ముట్టడి

పంజగుట్ట: అంబేద్కర్‌పై వ్యంగ్యంగా మాట్లాడిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని మాల సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. లేనిపక్షంలో మాల సంఘాలు, అంబేద్కర్ వాదులతో కలిసి ఈ నెల 6వ తేదీన బీజేపీ రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య, రాజు వస్తాద్, మందాల భాస్కర్, చెరుకు రాంచందర్‌లు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అంబేద్కర్‌వాదులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలు ప్రతీ జిల్లాలోని బీజేపీ కార్యాలయాన్ని 6వ తేదీన ముట్టడించాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లే తాను ప్రధాని అయ్యానని ఒకవైపు మోదీ అంటే మరోవైపు అమిత్‌షా అంబేద్కర్ గురించి అనుచితంగా మాట్లాడడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు.

సావిత్రిబాయికి ఘనంగా నివాళి



దూద్‌బావి పాఠశాలలో సావిత్రిబాయిఫూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

చిలకలగూడ: మహిళల హక్కుల కోసం పోరాడిన సంఘసంస్కర్త సావిత్రిబాయిఫూలే జయంతి వేడుకలు మెట్టుగూడ డివిజన్ దూద్‌బావి ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యాశాఖ ఉప పర్యవేక్షణాధికారి మదన్‌మోహన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై సావిత్రిబాయి ఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వివిధ పాఠశాలలకు చెందిన హెచ్‌ఎంలు అనురాధ, మంజుల, సునీత, పుష్పలత, ఉపాధ్యాయులు ఉమా, మల్లీశ్వరీ, అయేషా అంజూమ్, హసీనాబేగం, సాలెహా, షహీన్ బేగంలకు పుష్పగుచ్ఛాలు అందించి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. దూద్‌బావి పాఠశాల హెచ్‌ఎం మల్లిఖార్జునరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవానికి ప్రతీక..

లాలాపేట: సావిత్రీబాయి ఫూలే మహిళా ఆత్మగౌరవానికి ప్రతీక అని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ సుల్తాన్ యాదగిరి అన్నారు. ఈ మేరకు తార్నాకలో తెలంగాణ ఉద్యమకారుల మహిళా జేఏసీ కార్యాలయంలో జరిగిన జయంతి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని సావిత్రిబాయి చిత్రపటానికి నివాళి అర్పించారు. మహిళా జేఏసీ నేత కోతి మాధవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జేఏసీ ప్రధాన కార్యదర్శి ప్రఫుల్ రామిరెడ్డి, కోశాధికారి చంద్రన్న ప్రసాద్, లక్ష్మీకాంతమ్మ, రేణుక, అరుణ, లావణ్య, రాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యాలయాలకు సావిత్రీబాయి పేరు పెట్టాలి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలు, మహిళ కాలేజీలకు సావిత్రిబాయిఫూలే పేరు పెట్టాలని బీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్ అన్నారు. శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట బీఎస్ఎఫ్ నాయకులు కల్వకుర్తి శ్రీశైలం ఆధ్వర్యంలో సావిత్రిబాయిఫూలే 194వ జయంతి జరిగింది. ఈ సందర్భంగా సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు ఆరెకంటి శ్రీకాంత్, మంద మల్లేష్, కరుణాకర్, మహేష్, మోహన్, రాజు, మధు తదితరులు పాల్గొన్నారు.

అడ్డగుట్ట: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సావిత్రీబాయి ఫూలే 194వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ అనురాధ, ఎంవీఫౌండేషన్ ఆర్గనైజర్ ఎ.సువర్ణ తదితరులు సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడపిల్లల విద్యాభివృద్ధికి సావిత్రీబాయి ఫూలే చేసిన కృషిని శ్లాఘించారు. ఆమె భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలనీ కొనియాడారు. కార్యక్రమంలో టీచర్లు ఉమాశ్రీ, సరిత, హిమబిందు, జ్యోతిలక్ష్మీ, సృజన, లావణ్య, సుకన్య పాల్గొన్నారు.



సావిత్రిబాయి ఫూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం



సావిత్రిబాయి చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న బోరెల్లి సురేష్



సావిత్రిబాయి ఫూలే జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న సుల్తాన్ యాదగిరి

‘వెటరన్స్’ సహకారం తీసుకుంటాం: ఎమ్మెల్యే శ్రీగణేశ్



ఎయిర్ వారియర్స్ వెటరన్స్ మీటింగ్ హాలు ప్రారంభోత్సవంలో మాట్లాతున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: కంటోన్మెంట్ అభివృద్ధిలో వెటరన్ ఎయిర్ వారియర్స్ సలహాలు, సూచనలతోపాటు వారి సహకారం ఎంతో అవసరమని ఎమ్మెల్యే శ్రీగణేశ్.బొల్లారంలోని కళాసిగూడలో వెటరన్ ఎయిర్ వారియర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన మీటింగ్ హాల్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సైన్యంలో చేరి దేశానికి సేవ చేసి రిటైర్ అయిన వెటరన్ ఎయిర్ వారియర్స్ మీటింగ్ హాల్ నిర్మాణం కోసం కూడా పోరాటం చేయాల్సి వచ్చిందన్నారు. వెటరన్స్ కోసం కూడా తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానని, వారి సంక్షేమం కోసం ప్రభుత్వ నిధులతోపాటు అవసరమైతే తాను స్వయంగా నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే కళాసిగూడలోని హరి ఓమ్ కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. అంతర్గత రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ లేక ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యేకు కాలనీవాసులు వివరించారు. త్వరలోనే ఆయా సమస్యలు తీరుస్తానని ఎమ్మెల్యే తెలిపారు.

సీఎంకు శుభాకాంక్షలు



సీఎంకు శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రొ ఇటిక్యాల పురుషోత్తం

లాలాపేట: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శుక్రవారం ఆయన నివాసంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం, హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కోఆర్డినేటర్ శ్రీరామ్ శివకుమార్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎంను శాలువాతో సన్మానించారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.


దేశ ఐక్యతకు కృషి చేయాలి



మాట్లాడుతున్న మోహన్‌రావు

సనత్‌నగర్: బేగంపేటలోని సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజ్ ఫర్ ఉమెన్ డిపార్ట్‌మెంట్ ఆఫ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో ‘భారతదేశ ప్రగతి మార్గం: సుపరిపాలన చొరవ’ అనే అంశంపై ప్రసంగ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని పురస్కరించుకుని పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ హెడ్ ఎమ్మెస్ డి.రూపాలి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రైల్వే డిగ్రీ కళాశాల పబ్ అడ్మిన్ (రిటైర్డ్) పి.మోహన్‌రావు హాజరై కీలకోపన్యాసం చేశారు. భారతదేశ అభివృద్ధి, దేశ ఐక్యతనుముందుకు తీసుకువెళ్లడంలో ప్రతిఒక్కరి భాగస్వామ్యం అవసరమన్నారు. జవాబుదారీతనం, పారదర్శకతను పెంపొందింపజేయాల్సిన అవసరాన్ని నొక్కి వక్కాణించారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగపురి రోజాకు సావిత్రిబాయి పూలే అవార్డు



అవార్డును అందుకుంటున్న నాగపురి రోజా

ఉస్మానియా యూనివర్సిటీ: రైల్వే డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్ అధ్యాపకురాలిగా పని చేస్తున్న నాగపురి రోజా సావిత్రిబాయి పూలే అవార్డును అందుకున్నారు. శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో జరిగిన సావిత్రిబాయిపూలే 194వ జయంతి ఉత్సవాలలో బీసీ నేత జాజుల శ్రీనివాస్‌గౌడ్ చేతుల మీదుగా రోజా అవార్డును అందుకున్నారు. బోధన, సమాజసేవకుగాను సావిత్రిబాయి పూలే అవార్డు లభించినట్లు రోజా చెప్పారు. సావిత్రిబాయి స్ఫూర్తితో భవిష్యత్తులో పేదలకు విద్యతోపాటు ఇతర సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు.

వైభవంగా ధనుర్మాస మహోత్సవాలు





తిరుప్పావై పాశురాల పారాయణం చేస్తున్న భక్తులు, ప్రత్యేక అలంకరణలో శ్రీవారు

సనత్‌నగర్: హనుమాన్ దేవాలయం ప్రాంగణంలోని శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ధనుర్మాస మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా 19వ రోజు స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణతోపాటు తిరుప్పావై పాశురాల పారాయణం, విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈవో సత్యనారాయణ పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు పరాశరం రవీంద్రాచార్యుల ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది కాటం శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ వర్సిటీ మహిళల వాలీబాల్ జట్టు ఎంపిక



ఎంపికైన కేఎన్ఆర్ వర్సిటీ మహిళా వాలీబాల్ జట్టుతో సెలక్షన్ కమిటీ ప్రతినిధులు

గాంధీఆస్పత్రి: కాళోజీ నారాయణరావు(కేఎన్ఆర్) హెల్త్ యూనివర్సిటీ మహిళల వాలీబాల్ జట్టు ఎంపిక సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీలో శుక్రవారం జరిగింది. 12 మంది సభ్యులతో తుదిజట్టును ప్రకటించారు. తమిళనాడు చెన్నైలోని జెప్పియర్ యూనివర్సిటీలో ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్ టోర్నమెంట్‌లో కేఎన్ఆర్ వర్సిటీ తరఫున ఈ జట్టు పాల్గొంటుంది. సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ విద్యార్థులు శృతి ముండాడ, మీసాల ఉజ్వల, చక్రవర్తుల శుక్రుత, సభావత్ అనూష, పంగ అక్షరవీణ, భవ్యశ్రీ, మమత తుదిజట్టుకు ఎంపికయ్యారు. మల్లారెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కాలేజీకి చెందిన కావేరి నూకల, అతిథి పూరి, మమత అకాడమీ మెడికల్ సైన్సెస్‌కు చెందిన ఉజ్వలరెడ్డి, మంతెన సాయిప్రీతి, గవర్నమెంట్ కాలేజీ ఆఫ్ నర్సింగ్ విద్యార్థి జోగురూప ఎంపికైనట్లు సెలక్షన్ కమిటీ ప్రకటించింది. తుదిజట్టుకు ఎంపికైన క్రీడకారిణులను గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రవి శేఖరరావు, గాంధీ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్(పీడీ) వేణు అభినందించారు. కేఎన్ఆర్ వర్సిటీ జట్టు అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించి, టోర్నమెంట్ విజేతగా నిలవాలని ఆకాంక్షించారు. ఫిజికల్ డైరెక్టర్లు రమేష్, సందీప్‌కుమార్, శివకుమార్ సెలక్షన్ కమిటీ సభ్యులుగా వ్యవహరించారు.

కాంట్రాక్టు అధ్యాపకులకు పే స్కేల్ అమలు చేయండి



మాట్లాడుతున్న అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని 12 వర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకు పే స్కేల్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట అధ్యాపకులు మాట్లాడుతూ బేసిక్, డీఏ, హెచ్ఆర్ఏతో కూడిన పేస్కేల్‌ను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. పే స్కేల్‌ను అమలు చేశాకే వర్సిటీల్లో అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపక సంఘం నాయకులు ధర్మతేజ, ఉపేందర్, సీమర్ల విజేందర్ రెడ్డి, వాణి, సుజాత, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

తలసానికి శుభాకాంక్షలు



ఎమ్మెల్యే తలసానికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న డీసీ సమ్మయ్య

సనత్‌నగర్: నూతన సంవత్సరం సందర్భంగా సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఆయన కార్యాలయం వద్ద పలువురు అధికారులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పలు కాలనీలకు చెందిన అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నార్త్‌జోన్‌కు చెందిన డీసీ సమ్మయ్య, జీహెచ్ఎంసీ ఈఈ సుదర్శన్, డీఈ ఆంజనేయులు, చంద్రశేఖర్, ఏఈలు చైతన్య, బేగంపేట డివిజన్ పాటిగడ్డ బస్తీ అధ్యక్షుడు శేఖర్ ఆధ్వర్యంలో బస్తీవాసులు, అమీర్‌పేట డివిజన్ గాయత్రీనగర్‌వాసులు, బన్సీలాల్‌పేట, రాంగోపాల్‌పేట డివిజన్లలోని పలు కాలనీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కిషోర్, ఆంజనేయులు, విజయ్, కోటీశ్వర్‌గౌడ్, ప్రేమ్‌కుమార్, కుమార్‌యాదవ్, సురేష్, జితేందర్ శుక్లా, బాబా, వినోద్, సాయి, శివ తదితరులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

బీసీ మహాధర్నాకు తరలిన ఓయూ విద్యార్థులు



మాట్లాడుతున్న కందుల మధు, విజయరావు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఎమ్మెల్సీ కవిత ఇందిరాపార్క్ వద్ద శుక్రవారం చేపట్టిన మహాధర్నాకు ఓయూ నుంచి విద్యార్థులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. బీఆర్ఎస్ విద్యార్థి, యువజన సంఘాల రాష్ట్ర నాయకులు డాక్టర్ కందుల మధు, కె.విజయరావు ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ ఎదుట విద్యార్థుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మధు, విజయరావు మాట్లాడుతూ ఎన్నికల హామీలను తుంగలో తొక్కి సీఎం రేవంత్‌రెడ్డి ఇష్టారాజ్యంగా పరిపాలిస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను పూర్తిగా విస్మరించిందని ధ్వజమెత్తారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్సీ కవిత ప్రారంభించిన ధర్నాతో కాంగ్రెస్, బీజేపీ నేతల వెన్నుల్లో వణుకు మొదలైందన్నారు. అనంతరం మహాధర్నాలో పాల్గొనేందుకు వివిధ వాహనాల్లో సుమారు వెయ్యి మందికిపైగా విద్యార్థులు తరలివెళ్లారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు రవి, కిరణ్, క్రాంతి, సందీప్, రాజు, శ్రీనునాయక్, మేడి రాజు, రాజేష్, పరమేష్, సాగర్, ధీరజ్ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి పైప్‌లైన్ పనుల పరిశీలన



పైప్‌లైన్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొంతం దీపిక

రాంగోపాల్‌పేట్: మోండా మార్కెట్ డివిజన్‌లో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ కొంతం దీపిక అధికారులకు సూచించారు. శుక్రవారం ఆమె డివిజన్‌లోని రెజిమెంటల్‌బజార్‌లో జరుగుతున్న మంచినీటి పైప్‌లైన్ పనులను డీజీఎం విద్యా సాగర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను ప్రజలకు ఇబ్బందులు లేకుండా వేగం పూర్తి చేయాలని సూచించారు. ఈ పైప్‌లైన్ నిర్మాణ పనులు పూర్తి అయితే స్థానికులకు మంచినీటి సమస్య ఉండదని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నరేష్, నర్సింగ్ యాదవ్, ప్రశాంత్ జైన్, నాగేందర్, సంతోష్, లల్లు, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యంపై కొరడా



స్పెషల్ డ్రైవ్‌లో నార్త్‌జోన్ డీసీపీ రశ్మీ పెరుమాళ్

సనత్‌నగర్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై నార్త్‌జోన్ పోలీసులు కొరఢా ఝుళిపించారు. డీసీపీ సాధన రష్మీపెరుమాళ్ నేతృత్వంలో పోలీసులు పలు బృందాలుగా ఏర్పడి బేగంపేట పోలీస్ స్టేషన్‌లో పరిధిలో శుక్రవారం రాత్రి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అదనపు పోలీసు బలగాలను సైతం రంగంలోకి దించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి ఆటకట్టించే దిశగా చర్యలు చేపట్టారు. బేగంపేట పీఎస్ పరిధిలోని రసూల్‌పురా అన్నానగర్, శ్రీలంక బస్తీ, పాటిగడ్డ, ప్రకాష్‌నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి అసాంఘిక శక్తులను అదుపులోకి తీసుకున్నారు. ముఖ్యంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిని, ఈవ్ టీజింగ్ పాల్పడేవారిని, గంజాయి సేవించేవారిని మొత్తం 25 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తితోపాటు ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే మరింత వేగవంతం

రంగంలోకి 58 టీమ్‌లు





ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

- 26,580 దరఖాస్తుదారుల సర్వే లక్ష్యంగా..
- ఇప్పటివరకు 8 వేల వరకు పూర్తి
- సంక్రాంతిలోపు పూర్తి చేసే దిశగా సిబ్బందికి దిశానిర్దేశం

సనత్‌నగర్: ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియ వేగం పుంజుకుంది. ప్రభుత్వ ప్రవేశపెట్టిన ప్రజాపాలన కార్యక్రమం ద్వారా స్వీకరించిన దరఖాస్తుల ఆధారంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతోంది. జీహెచ్ఎంసీ బేగంపేట సర్కిల్ పరిధిలోని బన్సీలాల్‌పేట్, రాంగోపాల్‌పేట్, మోండా, బేగంపేట డివిజన్లవ్యాప్తంగా 26,580 దరఖాస్తుదారులను ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు ఎంపిక చేశారు. ఆ మేరకు వారం రోజులుగా ఈ ప్రక్రియ జరుగుతోంది. కేవలం 20 టీమ్‌లను మాత్రమే నియమించి సర్వేను మొదలుపెట్టారు. అయితే సర్వే చేసే సమయంలో పలు లోటుపాట్లు తెర మీదకు రావడం, సర్వేకు చాలా సమయం తీసుకోవడం, కొన్ని ఇళ్ల తాళాలు వేసి ఉండటం వంటి కారణాలతో సర్వే ప్రక్రియ మందకొడిగా సాగుతూ వచ్చింది. ఆయా లోటుపాట్లపై విశ్లేషణ చేసిన ఉన్నతాధికారులు సర్వే ప్రక్రియను వేగవంతం చేసే దిశగా మరిన్ని బృందాలను రంగంలోకి దించారు. 20 టీమ్‌లను 38కి పెంచారు. అయితే లక్ష్యం పెద్దది కావడంతో ఆ సంఖ్య కూడా సరిపోదని భావించిన అధికారులు మరో 20 బృందాలను అదనంగా నియమించి మొత్తం 58 బృందాలతో సర్వే ప్రక్రియలో వేగం తీసుకువచ్చారు. ఇప్పటివరకు 8 వేల వరకు దరఖాస్తుదారుల సర్వే పూర్తి చేశారు. సంక్రాంతిలోపు ఈ సర్వేను పూర్తిచేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నారు. ముందస్తుగానే సర్వే చేసే కుటుంబాలకు సమాచారాన్ని ఇచ్చి అందుబాటులో ఉండాలని సూచిస్తున్నారు. ఆ మేరకు నిర్ణీత గడువు లోగా సర్వేను పూర్తి చేసే దిశగా అడుగులు వేస్తున్నారు.

తరచూ సాంకేతిక ఇబ్బందులు..

సర్వే వివరాల సేకరణలో భాగంగా లబ్ధిదారుల ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేసే క్రమంలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నట్లు తెలుస్తోంది. దీంతో కాస్తా సర్వే ప్రక్రియలో కొంత జాప్యం ఏర్పడుతోందని సిబ్బంది పేర్కొంటున్నారు. యాప్‌లో ఫొటోలు లోడ్ అయ్యేందుకు ఎక్కువ సమయం తీసుకోవడం వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వాపోతున్నారు. కొన్నిచోట్ల నెట్‌వర్క్ సమస్య కూడా ఉండటంతో మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి.